## క్లుప్తంగా

### సర్దార్‌నగర్‌లో 'కంటి వెలుగు'



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**తుక్కుగూడ:** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీ వెంకట్రామ్ సూచించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్లు, వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు, అద్దాలు పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజుకుమార్, కౌన్సిలర్ రెడ్డిగళ్ల సుమన్, రాజమౌని రాజు, నాయకులు సప్పిడి రాజు, బూడిద శ్రీకాంత్, గడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మశ్రీ తదితరులు

**మీర్‌పేట:** కాలనీలోని డ్రైనేజీ లైన్‌లకు మరమ్మతులు చేపట్టాలని మీర్‌పేట కార్పొరేషన్ సిర్లాహిల్స్ వెల్ఫేర్ వీకర్ సెక్షన్స్ అసోసియేషన్ మహిళలు బుధవారం కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కే పద్మశ్రీ మాట్లాడుతూ.. కాలనీలోని పోచమ్మ గుడి సమీపంలో డ్రైనేజీ పైపులైన్లు పగిలిపోవడంతో తరచూ మురుగునీరు ఇళ్లలోని బాత్‌రూంలు, నీటి సంపుల్లోకి చేరుతోందన్నారు. ఆ నీటిని వాడడం వల్ల కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే డ్రైనేజీ లైన్లకు మరమ్మతులు చేపట్టాలని ఆమె కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుజాత, సోని, తదితరులు ఉన్నారు.

### 'చలో రాజ్‌భవన్'కు కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్‌కు వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

**రంగారెడ్డి జిల్లా:** కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను అంబానీ, అదానీ వంటి పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు చలో రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ మహేశ్వరం మండల నాయకులు గురువారం తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ, నరేంద్ర మోదీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమానికి తరలిన వారిలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఎం బాల్‌రాజ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జీ రాజు, నాయకులు ఈ ప్రవీణ్, ఏ చంద్రమోహన్, జీ ఆనంద్, పీ శివకుమార్ తదితరులు ఉన్నారు.

### రంజాన్‌కు ఇబ్బందులు ఉండొద్దు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ తదితరులు

**పహాడీషరీఫ్:** త్వరలో ప్రారంభంకానున్న పవిత్ర రంజాన్‌కు బస్తీల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించాలని జల్‌పల్లి మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫమిదా కోరారు. బుధవారం ఈ మేరకు బీఆర్‌ఎస్ మున్సిపల్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌తో కలిసి కమిషనర్ వసంతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ ఫమిదా మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిత్యం ఐదు పర్యాయాలు మసీదులో ప్రార్థనలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మసీదులకు వెళ్లే మార్గాల్లో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. అన్ని బస్తీల్లో వీధి దీపాలు వెలిగేలా చూడడం తోపాటు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ నాయకుడు సయ్యద్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.



కందుకూరు: విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న సిబ్బంది



కందుకూరు: హాల్ టికెట్ నంబర్ల చూసుకుంటున్న విద్యార్థులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పరీక్షా కేంద్రం వద్ద..



కందుకూరు: పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు



# మొదటి రోజు ప్రశాంతం

ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పేపర్ -1 పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సందడి కనిపించింది. విద్యార్థుల్ని తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి పంపారు. సరూర్‌నగర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హరీష్ తోపాటు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వెంక్యానాయక్ సందర్శించారు. - సాక్షి నెట్‌వర్క్

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు

**మీర్‌పేట:** కార్పొరేషన్ పరిధిలోని గాయత్రినగర్ శ్రీ శారదా లక్ష్మీనరసింహస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం మజ్జిగద్గురు శంకరాచార్య, స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి సమక్షంలో ఆలయంలో ప్రబోధోత్సవం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అదే విధంగా వార్షికోత్సవానికి బీఆర్‌ఎస్ యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు అర్కల భూపాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, వంటేరు, నాయకుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


### మహోన్నత వ్యక్తి కాన్షీరామ్



కాన్షీరాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

**బడంగ్‌పేట్:** అణచివేతకు గురైన ప్రజల బాగు కోసం తపించిన మహోన్నత వ్యక్తి మాన్యశ్రీ కాన్షీరామ్ అని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా మంది తాము మాత్రమే నాయకులు కావాలని కోరుకుంటారని, కాన్షీరామ్ ఇందుకు భిన్నమని, అణచివేతకు గురైన ప్రజలను కూడా నాయకులను చేసిన ఘనత ఆయన సొంతమన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్, బాబు, మహేష్, నాగేష్, శాంతి కుమార్, రజినీకాంత్, వేణు, సంజీవ, శరత్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# భవనం.. శిథిలం



పహాడీషరీఫ్ దర్గా వద్ద శిథిలావస్థకు చేరిన భవనం

**పహాడీషరీఫ్:** ప్రమాదాలు జరిగినప్పుడే స్పందించే అధికార యంత్రాంగం.. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాల విషయం మాత్రం పట్టించుకోవడం లేదు. చారిత్రాత్మకమైన పహాడీషరీఫ్ బాబా షర్ఫొద్దీన్ దర్గా మెట్ల మార్గం ప్రారంభం పక్కన ఉన్న భారీ భవనం పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 757వ ఉర్సు ఉత్సవాల సందర్భంగా వేల మంది పాల్గొంటున్న ఈ దర్గా వద్ద ఉన్న ఈ పాత భవనం పొరపాటు కూలితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

# నిలువ నీడ కరువు..!

- రోడ్ల విస్తరణ పేరిట బస్‌షెల్టర్ల కూల్చివేత
- షెల్టర్లు ఉన్నచోట ఆగని బస్సులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం



రోడ్డు విస్తరణలో భాగంగా బడంగ్‌పేటలో కూల్చి వేసిన బస్‌షెల్టర్

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విస్తరణ పేరిట ఉన్న బస్ షెల్టర్లు తొలగించారు. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారు. మరోవైపు బస్ షెల్టర్లు ఉన్న చోట్ల ఆర్టీసీ బస్సులు ఆగడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బడంగ్‌పేటలో రోడ్ల విస్తరణ వల్ల ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న బస్ షెల్టర్లను తొలగించారు. నవీన బస్ షెల్టర్లు నిర్మించి ఏడాది కాలమే అయినా రోడ్ల విస్తరణ కోసం తొలగించక తప్పలేదంటున్నారు. అలాగే పట్టణంలోని సీతామెడోస్, జిల్లా పరిషత్ హైస్కూల్, పాత గ్రామ పంచాయతీ కార్యాలయం, పెద్ద గణేష్ వద్ద, అన్నపూర్ణ నగర్ కాలనీ, బడంగ్‌పేట కమాన్ వద్ద ఉన్న బస్ షెల్టర్లను తొలగించారు. ఇప్పటి వరకు వాటిని తిరిగి నిర్మించలేదు.

**ఆదాయం కోల్పోతున్న ఆర్టీసీ**

బస్ షెల్టర్లు ఉన్నప్పుడు ఆర్టీసీకి, బడంగ్‌పేట కార్పొరేషన్‌కు కొంత మేర ఆదాయం వచ్చేది. బస్ షెల్టర్లకు వాణిజ్య ప్రకటనలు, బర్త్ డేలు, వీఐపీల కోసం స్వాగత తోరణాలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రకటనల ద్వారా ఆదాయం సమకూరేది. బస్ షెల్టర్లను తిరిగి నిర్మించకపోవడంతో ఆదాయాన్ని కోల్పోతున్నారు.

**బస్ షెల్టర్లు నిర్మించాలి**



రోడ్ల విస్తరణ పేరుతో బస్ షెల్టర్లను కూల్చివేశారు. వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించలేదు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వెంటనే బస్ షెల్టర్లు నిర్మించాలి. అలాగే షెల్టర్లు ఉన్న చోట బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులు చొరవ చూపాలి.
– శ్రీనివాస్, బీఎస్పీ నాయకుడు, బడంగ్‌పేట్

**ఎండలో ఎండుతూ..**

బస్సుల కోసం ప్రయాణికులు ఎండలో వానలో రోడ్ల పైనే వేచి చూస్తున్నారు. ఒక్కోసారి గంట పాటు బస్సుల కోసం నిరీక్షించాల్సి ఉంటుంది. బడంగ్‌పేటకు చెందిన పలు కాలనీల విద్యార్థులు ఉన్నత చదువుల కోసం నిత్యం నగరానికి రాకపోకలు సాగిస్తుంటారు. వారు కూడా ఎండలోనే బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. తమ కష్టాలను అర్థం చేసుకొని బస్ షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.

### అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

**తలకొండపల్లి:** అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మెదక్‌పల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం తలకొండపల్లి తహసీల్దార్‌కు కృష్ణకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని మెదక్‌పల్లి గ్రామంలోని 123 సర్వే నంబర్ భూమిలో కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి రాత్రివేళల్లో లారీల్లో రవాణా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కొంతమంది బడా నాయకుల మద్దతుతో ఈ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మట్టి తవ్వకాలు ఆపాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

### చెక్కు అందజేత

**ఆమనగల్లు:** మాడ్గుల మండల కేంద్రానికి చెందిన శివకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి పథకం కింద రూ.33 వేలు మంజూరయ్యాయి. బుధవారం మాజీ సర్పంచ్ కొండల్ రెడ్డి చెక్కును శివకు అందించారు. నాయకులు రాములు, జంగయ్య, నర్సింహ పాల్గొన్నారు.

# దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం

**దిల్‌సుఖ్‌నగర్:** ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి అనుకూలంగా క్రోనీ క్యాపిటలిజం విధానాన్ని అనుసరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం చలో రాజ్ భవన్ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆర్‌కే పురం, సరూర్‌నగర్ డివిజన్స్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, చిక్కుళ్ల శివ ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, తలాటి రమేష్ నేత, పెద్దవూర సైదులు, శివ, బొడ్డుపల్లి మహేందర్, కళ్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, పగడాల శ్రీశైలం, ఇస్మాయిల్, నగేష్ నేత, అనుదీప్, శ్రవణ్ కురుమ, టైగర్ శివ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

**తరలిన ఎల్‌బీనగర్ నేతలు...**

**చైతన్యపురి:** అదానీ ఆర్థిక కుంభకోణంపై పార్లమెంటరీ కమిటీచే విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపదను అదానీకి కట్టబెడుతోందని విమర్శించారు. గవర్నర్‌ను కలిసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయటం అక్రమమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కులవృత్తులను ఆదుకుంటాం



కుండల తయారీని పరిశీలిస్తున్న వెంకటేశ్‌గుప్తా

**కడ్తాల్:** కులవృత్తులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో కుమ్మరులు తయారు చేస్తున్న కుండలను వారు పరిశీలించారు. కుమ్మరి సారేను కట్టెతో తిప్పాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, దానికి అవసరమయ్యే యంత్రాలను సమకూర్చాలని కుమ్మరులు వారి దృష్టికి తెచ్చారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా త్వరలో ఎలక్ట్రానిక్ సారేలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి కార్మికులు నర్సింహ, రాములు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, సర్పంచ్ యాదయ్య, భారతమ్మ, నర్సింహగౌడ్, ఉప సర్పంచ్ వినోద్, నాయకులు ఉన్నారు.

### నర్సరీల పరిశీలన

**ఆమనగల్లు:** మాడ్గుల మండలంలోని నర్సాయిపల్లి, గుడితండా, కొత్రగానితండాల్లో బుధవారం ఎంపీడీఓ రాఘవులు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పర్యటించారు. ఆయా గ్రామాల్లోని వన నర్సరీలను వారు పరిశీలించారు. హరితహారం కార్యక్రమం వరకు మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఆడపడుచులకు అండగా ఉంటాం

సర్పంచ్ గోదాదేవి

**ఆమనగల్లు:** మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో వివాహం చేసుకోబోయే ఆడపడుచులకు పెళ్లికానుక అందించి అండగా ఉంటామని శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి, టీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. శెట్టిపల్లి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి ఎగిరిశెట్టి గోదాదేవి, సత్యం దంపతులు గ్రామంలో వివాహం చేసుకోబేయే అమ్మాయిలకు రూ.10116 లను పెళ్లికానుకగా అందిస్తున్నారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఈదమ్మ, మల్లయ్య దంపతుల కుమార్తె రాణి వివాహం సందర్భంగా బుధవారం ఎగిరిశెట్టి సత్యం రూ.10116 అందించారు. ఇప్పటివరకు 57 మంది అమ్మాయిల వివాహానికి పెళ్లి కానుక అందించామని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ప్రజలకు అండగా ఉంటామని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటయ్య, స్థానిక నాయకులు యాదయ్య, నర్సింహా, పర్వతాలు, మహేశ్, పరశురాములు, జంగయ్య, శివ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ టీపీతోనే సంక్షేమ పాలన

నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరిన నాయకులు

**ఆమనగల్లు:** రాష్ట్రంలో వైఎస్సార్‌టీపీతోనే సంక్షేమ పాలన సాధ్యమని కల్వకుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి చెప్పారు. ప్రజలంతా వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలకు అండగా ఉండాలని ఆయన కోరారు. మాడ్గుల మండల కేంద్రంలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని అంతంపేట గ్రామానికి చెందిన పర్వతాలు, సాయిలు, యాదయ్య, వెంకటయ్య, లింగయ్య, రామస్వామి, యాదయ్య, లాలయ్య, బుచ్చయ్య, జహంగీర్ తదితరులు చీమర్ల అర్జున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందాయని గుర్తుచేశారు. అలాంటి సంక్షేమ పాలన షర్మిలతోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌టీపీని ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు శివనాయక్, నాయకులు.. ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, శివప్రసాద్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, నరేశ్, రవి, గోపాల్, నవీన్, దినేశ్, యాదగిరి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

**మంచాల:** ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లో మట్టి తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. అక్రమార్కులకు మట్టి వ్యాపారం కాసుల పంట పండిస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మంచాల మండలంలోని మెజార్టీ భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో ఉన్నాయి. గుట్టలు, రాళ్లతో కూడిన పొలాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసిన రియల్ వ్యాపారులు వాటిలో ఎలాంటి అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. తవ్విన మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘాట్, నోముల, లింగంపల్లి గ్రామాల్లో పెద్దఎత్తున కొత్త వెంచర్లు వెలుస్తుండటంతో అక్కడ పెద్ద మొత్తంలో మట్టి అవసరముంటోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మట్టికి బాగా డిమాండ్ ఏర్పడింది. బోడకొండ, కొర్రంతండా, లోయపల్లి గ్రామాల్లో మట్టిని ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాలతో పాటు సెలవు దినాల్లో మట్టి తవ్వకాలు, తరలింపు ఎక్కువగా నిర్వహిస్తున్నారు.

**కొండలనూ వదలని వైనం..**

ఇదిలా ఉండగా కాగజ్‌ఘాట్, ఆగాపల్లి, నోముల, ఆరుట్ల, బండలేమూర్, ఎల్లమ్మ తండా, లోయపల్లి గ్రామాల్లోని గుట్టలను జెలిటిక్స్ వంటి పేలుడు పదార్థాలను ఉపయోగించి పగులగొట్టి కంకర, గ్రానైట్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. రియల్ వ్యాపారులు గుట్టలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని వెంచర్లుగా మార్చే ప్రక్రియలో భాగంగానే ఈ పనులు చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, పేలుడు పదార్థాలను ఉపయోగించడం చట్టరీత్యా నేరమని తెలిసినా పట్టించుకోకుండా గుట్టలను తవ్వేస్తున్నారు. మట్టి తరలించే సమయంలో రోడ్ల మీదకు ఒక్కసారిగా టిప్పర్లు పదుల సంఖ్యలో వేగంగా వస్తున్నాయని దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.